## క్లుప్తంగా

### రేపాల భద్రాద్రికి సన్మానం



భద్రాద్రిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

నల్లగొండ టౌన్ : శ్రీ వాసవీమాత, శ్రీ ఉమామహేశ్వర స్వామి సహిత శ్రీ రామకోటి స్థూప దేవాలయం కన్వీనర్‌గా నూతనంగా ఎన్నికైన రేపాల భద్రాద్రి రాములను సోమవారం ఆలయ ట్రస్టు సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుడిపాటి సత్యనారాయణ, కందుకూరి మహేందర్, నెహ్రూ, శరత్, మేడం ప్రసాద్, వెంకటనారాయణ, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రాల విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నకిరేకల్ : ఈ నెల 24, 25 తేదీల్లో నల్లగొండలో జరగబోయే కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వంటిపాక కృష్ణ కోరారు. శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రూపొందించిన ప్రచార కరపత్రాలను నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో సోమవారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మర్రి వెంకటయ్య, నాయకులు వంటిపాక వెంకటేశ్వర్లు, ఏర్పుల తాజేశ్వర్, నాగార్జున, వెంకన్న, సతీష్, సైదులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ : మండల కేంద్రంలోని గ్రంథాలయానికి రెండు వారాల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయమై సాక్షి దినపత్రికలో గ్రంథాలయానికి నిలిచిన విద్యుత్ సరఫరా అనే కథనం ఆదివారం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ సిబ్బంది అదే రోజు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

### 20న నులిపురుగుల నివారణ కార్యక్రమం

మర్రిగూడ : ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మర్రిగూడ యూపీహెచ్‌సీ వైద్యాధికారి దీపక్ సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో విద్యనభ్యసించే 2–19 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోజు వీలుకాని వారికి 27న మాత్రలు అందిస్తామన్నారు.

### మంత్రిని కలిసిన ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ



మంత్రికి బొకే అందజేస్తున్న కళ్యాణచక్రవర్తి

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రానికి సోమవారం వచ్చిన రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కళ్యాణ్ చక్రవర్తి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో సీజనల్ వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజారోగ్యంపై సమీక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో జె.శేఖర్‌రెడ్డి, బైరగోని భిక్షం, తదితరులు పాల్గొన్నారు.

### శిరీష కృషి అభినందనీయం



శిరీషను సన్మానిస్తున్న ఎంపీపీ రాజమణి

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి పంచాయతీ కార్యదర్శి శిరీష చేసిన కృషి అభినందనీయమని ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ అన్నారు. ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్న శిరీషకు సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆమె కృషిని కొనియాడారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చల్లం పాండురంగారావు, మాజీ సర్పంచ్‌లు కొట్టం మాధవిరమేష్, అయిలి లక్ష్మీనరసింహ, మాజీ ఉప సర్పంచ్ కొట్టం మల్లేష్, మేకల గోవర్ధన్ రెడ్డి, కొట్టం శ్రీను, డేరంగుల శ్రీశైలం, రజాక్, గోవింద్, సాలమ్మ, వజ్రమ్మ పాల్గొన్నారు.

### ముగిసిన బ్రహ్మోత్సవాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గీతామందిర్(గోవింద క్షేత్రం) శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం మహాపూర్ణాహుతి, చక్ర స్నానం అంగరంగ వైభవంగా జరిగింది.

# పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- పంచాయతీలకు నిధులు కరువు
- మరమ్మతులకు గురైన ట్రాక్టర్లు
- గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం



రాజాపేటతండాలో నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్ ట్రాలీ



రాజాపేటతండా సమీపంలో రోడ్డు వెంట వేసిన వ్యర్థాల వద్ద సంచరిస్తున్న శునకాలు

మర్రిగూడ : గ్రామాల్లోని చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లను సక్రమంగా వినియోగించకపోవడంతో చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. మర్రిగూడ మండలంలో 18 గ్రామపంచాయతీలు, 19 ఆవాస ప్రాంతాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 32,971 మంది ఉన్నారు. ప్రస్తుతం 40 వేలకు పైగా జనాభా ఉండవచ్చని అంచనా. గ్రామపంచాయతీల్లో చెత్తను తొలగించేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్టర్లు మరమ్మతులకు గురికావడంతో చెత్త కొంతమేరకు ఇళ్లలోనే నిల్వ ఉండిపోవడం, లేదంటే రహదారి పక్కన పడవేయడం జరుగుతోంది. కొందరు కోళ్ల వ్యర్థాలను రహదారుల పక్కన పడవేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

**ట్రాక్టర్లకు మరమ్మతులు చేయిస్తేనే..**

గత ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్, ట్రాలీ, నీటి ట్యాంకర్‌ను అందించింది. గ్రామాల్లో నిత్యం చెత్తను సేకరించి ఆ చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేసుకుంటే గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావించింది. అయితే ప్రస్తుతం పలు ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. గ్రామపంచాయతీల్లో నిధులు లేకపోవడంతో చాలా గ్రామాల్లో ట్రాక్టర్లు మూలకు పడ్డాయి.

**పన్నులు చెల్లించినా వసతులు కరువు**

గ్రామపంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో పన్నుల చెల్లింపు, మోటార్ల నిర్వహణ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రజలు చెల్లించిన పన్నులను పంచాయతీ కార్యదర్శులు సంబంధిత ఎస్‌టీఓలో జమ చేస్తున్నప్పటికీ పంచాయతీ అవసరాల కోసం నిధులు పొందాలంటే మూడు నుంచి ఆరు నెలలు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ట్రాక్టర్ మెయింటెనెన్స్‌తోపాటు సిబ్బందికి కూడా వేతనాలు అందించడం కష్టతరమవుతోందని పలువురు పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు పన్నులు చెల్లిస్తున్నా మౌలిక సదుపాయాలు సక్రమంగా లేవని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు చెత్త సేకరణ చేసి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని పలు గ్రామాల ప్రజలు ప్రత్యేక అధికారులను కోరుతున్నారు.

**చెత్త ట్రాక్టర్ రావడం లేదు**



కొన్ని రోజుల నుంచి చెత్త సేకరణ ట్రాక్టర్ తిరగడం లేదు. వర్షాలు కురిసిన రోజు వీధులు అధ్వానంగా మారుతున్నాయి. ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో రోగాల బారిన పడుతున్నాం. ట్రాక్టర్‌కు మరమ్మతులు చేపట్టి చెత్తను తొలగించాలి.

- రమావత్ సరిత, రాజాపేటతండా

**మరమ్మతులు చేపడతాం**



రాజాపేటతండాకు చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్ సెల్ఫ్ మోటార్, బ్యాటరీలు దెబ్బతిన్నాయని తెలిసింది. రెండు, మూడు రోజుల్లో ట్రాక్టర్‌కు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తెస్తాం. మిగతా గ్రామాల్లో నిత్యం చెత్త సేకరణ జరుగుతూనే ఉంది.

-బి.రవికుమార్, ఎంపీఓ, మర్రిగూడ

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కేసులు



కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న అధికారులు

మునుగోడు: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కేసులు తప్పవని తహసీల్దార్ ఎం.నరేందర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని చండూరు రోడ్డులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట కొందరు ప్రభుత్వ భూమిని కబ్జాచేశారని, దానిని వెంటనే స్వాధీనం చేసుకొని కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. స్పందించిన అధికారులు సోమవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. కబ్జాకు గురైన భూమిని గుర్తించి ఆ పక్కనే పద్మశాలి సంఘానికి కేటాయించిన స్థలంలో కలిపి మొత్తం 20 గుంటల భూమి సంఘం సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కబ్జాకు పాల్పడిన వ్యక్తులకు నోటీసులు జారీచేసి నాలుగైదు రోజుల్లో కేసు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ నాగరాజు, సర్వేయర్ జ్యోతి, పద్మశాలి సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



నల్లగొండ టౌన్ : మాట్లాడుతున్న ప్రభావతి

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్య, వైద్యం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. దేశంలో మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. పోలెబోయిన వరలక్ష్మీ, కొండా అనురాధ, పద్మ, అరుణకుమారి, నాగమణి, గోవర్ధన, ధనలక్ష్మీ, వెంకటమ్మ పాల్గొన్నారు.

**ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలి**

శాలిగౌరారం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ మండల సమీక్ష సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు పెట్టుబడి డబ్బులు లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతుబంధు డబ్బులను వెంటనే రైతుల ఖాతాలలో జమ చేయాలన్నారు. అదేవిధంగా రూ.2 లక్షల పంట రుణమాఫీని వెంటనే అమలు చేసి రైతులకు మేలు చేయాలన్నారు. కౌలు రైతులకు కౌలుబంధుతో పాటూ పంట రుణ సదుపాయాన్ని కల్పించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, కల్లూరి లింగయ్య, డెంకల లింగయ్య, మక్క బుచ్చిరాములు, సైదులు, శ్రీను, జగన్, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆలయ వార్షికోత్సవాలు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 108 కళశాలతో అష్టబంధ కలశ పూజ, కలశాభిషేకం, ఉపదేవత, నైవేద్యం వంటి కార్యక్రమాలను ఆలయ పూజరి వావిలాల నాగఫణిశర్మ, త్రినేత్ర నాగాంజనేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం–పుష్ప దంపతులు వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నూకల రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామంలో గల శ్రీసీతారామాంజనేయ శివచెన్నకేశవ ఆలయంలో సోమవారం 3వ వార్షికోత్సవాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి శివపార్వతుల కల్యాణం నిర్వహించి దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, ఆలయ చైర్మన్ చెవుగోని నాగరాజు, బెజవాడ సైదులు, లక్ష్మారెడ్డి, గుడిపాటి రవి, కొండ సత్తయ్య, రవి, వంశీ పాల్గొన్నారు.



కట్టంగూర్ : పూజలో పాల్గొన్న భక్తులు



నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

## ఘనంగా తొలి ఏకాదశి

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం తొలి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, మహాయజ్ఞాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ పూజారి రామడుగు అశ్విన్‌కార్తీక్, ఇల్లెందుల కృష్ణమూర్తి, కొత్త రామ్మూర్తి, గుడిపాటి పద్మ, శోభ, సంధ్య, కాపుగంటి రాజ్యం, బండారు అరుణ్‌కుమార్, ఇల్లెందుల సందీప్ పాల్గొన్నారు.



ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న పూజారి

### 19న వాచ్‌మెన్ పోస్టుకు ఇంటర్వ్యూ

కట్టంగూర్ : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కట్టంగూర్ పాఠశాలలో డే వాచ్‌మెన్(మహిళ) పోస్టుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 19న కస్తూరిబా పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంఈఓ మేక నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం మే 26న పోస్ట్‌ను భర్తీ చేయడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అనివార్య కారణాలతో భర్తీ చేయకుండా నిలిపివేశామన్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్‌తో ఇంటర్వ్యూకు హాజరుకావాలని పేర్కొన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామ పంచాయతీ లింగాలగూడెం ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్‌ఎం లెంకల మాధవరెడ్డి శిష్యులు సోమవారం జి యడవల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై చాలాకాలం తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు జన్నయ్య, విద్యా వలంటీర్లు రాంరెడ్డి, రజిత, వరలక్ష్మీ, సరిత, సుమతి, స్వరూప, సైదమ్మలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

### నిధులు విడుదల చేయాలి

చండూరు: ఆయిల్ పామ్ మొక్కలు నాటుకున్న రైతులకు అందించాల్సిన మెయింటెనెన్స్ నిధులను సకాలంలో విడుదల చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కాసాల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం చండూరు మండల కేంద్రంలో పలువురు రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటుకున్న రైతులకు నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి నలభై రెండొందల చొప్పున ప్రతి సంవత్సరం మార్చిలోగా అందించే మెయింటెనెన్స్ నిధులను సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మాదగోని నాగార్జున, దేప ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### 20న వేలంపాట

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ పరిధిలో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, లడ్డు, పులిహోర ప్రసాదం అమ్ముకునేందుకు, కొబ్బరి చిప్పల సేకరణకుగాను ఈ నెల 20వ తేదీన బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ నాగిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్‌లో పాల్గొనేవారు రెండు లక్షల రూపాయల డీడీ లేదా నగదు చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

### కేంద్ర పథకాలపై అవగాహన

మర్రిగూడ : కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామ భారతి ఆధ్వర్యంలో మంగళవారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పించనున్నట్లు మర్రిగూడ గ్రామభారతి అధ్యక్షురాలు సూర్యకళ తెలిపారు. వక్త మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు రామచంద్రయ్య ఈ సదస్సులో సలహాలు, సూచనలు చేయనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 9000167775 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### పండ్లు పంపిణీ

నకిరేకల్ : కాంగ్రెస్ నేత దైద రవీందర్ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలంలోని తాటికల్ శివారులో గల వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు. మాచర్ల సైదులు, వంటిపాక నక్షత్, అశ్విన్, రాజశేఖర్, సతీష్, సురేష్, నాగరాజు, సైదులు, మహేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

## త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ



నల్లగొండలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండుగ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా అందరూ కలిసి మెలిసి ఉంటున్నారన్నారు. పేద ముస్లింలకు ఇళ్లు కట్టిస్తానని, ఈద్గాను అభివృద్ధి చేస్తానని తెలిపారు. ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాల్లో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో చదువుకున్న ముస్లిం యువతీయువకులకు అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి నల్లగొండలోని 22వ వార్డు కౌన్సిలర్ సమద్ నివాసానికి వెళ్లి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రితోపాటు ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎస్పీ చందనా దీప్తి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఏఎస్పీ రాములునాయక్, ఆర్డీఓ రవి, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, బొడ్డుపల్లి లక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### శివలీలకు పురస్కారం



శివలీలకు అవార్డు, ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

కనగల్ : మండల కేంద్రానికి చెందిన న్యూ కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కంబాల శివలీల సోమవారం నల్లగొండ పట్టణంలోని పీఆర్టీయూ భవనంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతులమీదుగా సంఘమిత్ర జాతీయ పురస్కారం తోపాటు ప్రశంసాపత్రం అందుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, వృద్ధులకు, వితంతువులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, మజ్జిగ పంపిణీ, అన్నదాన కార్యక్రమాలువంటి సేవలకుగాను ఈ అవార్డు దక్కినట్లు శివలీల తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ బాల్‌రెడ్డి, సమాచార హక్కు సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బండమీది అంజయ్య పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

బక్రీద్ వేడుకలను నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ముస్లింలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

–సాక్షి నెట్‌వర్క్



నల్లగొండ : శుభాకాంక్షలు తెలుపుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీఓ, తహసీల్దార్



నల్లగొండ : బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఏఎస్పీ రాములునాయక్



మర్రిగూడ : బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



నకిరేకల్ : బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం



శుభాకాంక్షలు తెలుపుతున్న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



కట్టంగూర్ : అయిటిపాముల దర్గా వద్ద ..



గట్టుప్పల్ మండల కేంద్రంలో..



నార్కట్‌పల్లి : శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జెడ్పీటీసీ సత్తయ్య



చండూరు : ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసులు



శాలిగౌరారం : వల్లాలలో ఈద్గావద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కేతేపల్లి: బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



నల్లగొండ : శుభాకాంక్షలు తెలుపుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ సత్యనారాయణ